కథానిక

# మసాబు వెలుతురు

సామిధేని సావిత్రీదేవి

జోరుగా, హోరుగా వర్షం కురుస్తోంది. ఏడు గంటల సాయంత్రం మల్లే ఉంది, మూడు గంటల మధ్యాహ్నం. ఏడుగంటల సాయంత్రం—పట్టణాలో విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచేసే యంత్రం మానం వహించిన నాటి సాయంత్రం—జిల్లాబోర్డు ఉద్యోగస్థుల ఇళ్లల్లోకి అపరిమితమైన కిరసనాయిలు కావలసివచ్చిన సాయంత్రం. ఏడుగంటల సాయంత్రపు చీకటిని ధరించి వర్షిస్తున్నది, ఆనాటి మధ్యాహ్నం.

రంగం మహానగరంలో అద్దె కొంపలో ఒకగది. కథాకాలం, ప్రస్తుతం. కథానాయకుడు, రామారావు. రంగస్థలంలో ఏయే వస్తు సముదాయం ఉందో పోల్చుకోలేనంత మసాబు. రామారావు చేతులు వెనక్కి జారవేసి కాళ్లు జమిలి ట్రంకు పెట్టెల దొంతరకి దన్ను పెట్టి పడకకుర్చీలో పడుకొన్నాడు.। చుట్టూ చీకటిగా ఉన్నా కళ్లు మూసుకొన్న రామారావులో మసాబు వెల్తురు. రామారావు ఆలోచిస్తున్నాడు.

రామారావుని ఎవరేనా ఎవరికేనా ఎరుకపరుస్తున్నప్పుడు చెప్పే పరిచయవాక్యాలని మనంవింటే అతడి సాంఘికస్థానాన్ని పోల్చుకోగలం. వంద ఎకరాల పొలం, లక్షలమీద వ్యాపారం ఉన్న 'బీద' ఇనాందారుడి, 'దేశభక్త' వ్యాపారస్థుడి కుమారుడు రామారావు. ప్రస్తుతం పట్టణంలో చదువుకొంటున్నాడు. ఏచదువు అని ప్రశ్నించక్కర్లేదు. తండ్రి చావు బతుకులమధ్య మంచాన పడి కొట్టుకొంటున్న సమయందాకా ధన వంతుల బిడ్డ చదువుకోవచ్చు. పట్టణాల్లో నివసించవచ్చు.

అందరి ధనవంతుల బిడ్డలమల్లే రామారావు కార్మిక కర్షక జనులబాధని అపారంగా అర్థం చేసుకొన్నాడు. ప్రస్తుతం తండ్రితో వ్యతిరేకించి నెలకి రెండువందల రూపాయలు మాత్రమే తెప్పించుకొంటూ—ఆలోచిస్తున్నాడు.

మసాబు వెల్తురులో అతని కళ్లముందు కనబడే దృశ్యాలు ఫాక్టరీలో యంత్రరాక్షసి ఇనుప కోరలలో తన రక్తాన్ని పిండియిచ్చే కార్మిక పతితుడూ, వాడి సంసారం కాదు. మోకాలులోతు బురదలో నడుంవంచి పొలంలో పనిచేస్తున్న నిరక్షరాస్య కృషీవలుడూ, వాని సమస్యలూ కావు. రామారావు ఆడపిల్లల కాలేజీ వసతిగృహంలోని రంగు రంగుల చీరల హక్కుదారులలో ఒకానొక రెండు కండ్ల గురించి ఆలోచిస్తున్నాడు.'

వాన కురుస్తున్న మధ్యాహ్నం, సాయంత్రంలాంటి చీకటిలో వెచ్చదనం యిచ్చే గరంగరం చా, వేడి వేడి పకోడీలు, తాజా తాజా సిగరెట్టు పీల్పులు, మజా మజా ఆడపిల్లలు జ్ఞప్తికి వస్తారు గాని పీడితులూ, తాడితులూ మనస్సు నరాల దూలాలనిపట్టుకుని వేళ్లాడుతూ పీడించరు. రామారావు ఆలోచిస్తున్నాడు.

ప్రమాణపూర్తిగా చెప్పవచ్చు. మనం పెట్టే ఒట్టు తీసి గట్టుమీద పెట్టవలసిన అవశ్యకత ఏ మాత్రం ఉండబోదు. రామారావు మనోవాక్కాయ కర్మలచేత చరిత్రహీనుల మహాప్రస్థానం ద్వారా, నవ ధరిత్రి శుభ చరిత్ర లిఖించేటందుకు ఉద్యుక్తుడైన మాట అక్షరాలా నిజం. అయినా చలిగా వాన కురుస్తున్న వేళ ఆడపిల్లలు జ్ఞాపకం రావడం పార్టీ డిసిప్లిన్‌కి ఏమాత్రం భంగకరం కానేరదు. అందుకు ఉక్కుపాదాలు సైతం క్షమించగలవు.

ఇంతదాకా రామారావు అవివాహితుడని చెప్పకపోవడం నేరమే. రామారావు తన వివాహము విషయమై ఆలోచిస్తున్నాడని వెంటనే చెప్పివేస్తే ఇంతవరకూ ఏ విషయాన్ని చెప్పక, చేసినటువంటి పాపం పోతుంది. అనుమానం అక్కర్లేదు, గాంధీని చంపిన పాపమే కంచు విగ్రహాలు కడితే పోతున్నది కదా!

పెళ్లి చేసుకోనమని తండ్రి, పినతండ్రి, తల్లి, మేనత్తా, సమయానుకూలంగా అనవసర ప్రస్తావనలు తెచ్చే కుటుంబ బంధుమిత్ర పరివారాలు శత విధాలపోరేరు. అందుకే అలసిపోయి విద్యావ్యాసంగ నిమిత్తం పట్నం చేరుకొన్నాడు. పెద్దలు నిశ్చయించిన వధువు లక్షరూపాయల కట్నంతో వస్తుంది. కావలసిన సంబంధం. ఈరెండువాక్యాలు అర్థాన్ని స్ఫురింప చేసేటట్టయితే క్రమాన్ని మార్చినా ఇబ్బందిలేదు. రామారావు పెద్దలు నిశ్చయించే ఏ సంబంధమైనా అంతకట్నంతో రాక పోదు.

వధువు పల్లెటి ప్రాంతాలమనిషి కాదు. నాగరికతని సంపూర్ణంగా జీవితంలోకి చొప్పించుకొని ఆడపిల్లల కాలేజీలో చదువుకొంటూ వసతి గృహంలో నివసిస్తూ రంగురంగుల చీరలు ధరిస్తూ శనాదివారాలలో విధిగా సినీమాలు చూస్తూన్న జవ్వని. జవ్వని పట్నవాసంలో చదువుకొంటున్నా అనవసరంగా పెద్దల నిశ్చయాలతో జోక్యం కలిగించుకొనే రకంకాదు. చదువుకి ఫుల్‌స్టాపు పెట్టి, మెడకి మంగళసూత్రాన్నికట్టించుకొని, డ్రాయింగు రూములో దిళ్లు సర్దుతూ, లేతరంగుచీరలని సాణ్యాం చేస్తూ కొత్తరకం నగలు పురమాయించుతూ కాలక్షేపం చేసేందుకు అడ్డుచెప్పని పిల్ల.

వాస్తవానికి జవ్వని కాలేజీ చదువు రామారావుని ఆకర్షించేటందుకే. రెండేళ్ళక్రితం రామారావు అధమం కాలేజీ చదువు నేనా అలంకారంగాలేని అమ్మాయిని జీవిత భాగస్వామిని గావించుకొనలేడని అభిప్రాయపడి పెద్దలు అమ్మాయిని చదువులో పెట్టేరు. ఇద్దరూ ఒకేఒక పట్టణంలో నివసించే పక్షాన ఏ కాఫీహోటేలులోనైనా, ఏ సినీమాలోనైనా, ఏ బస్సులోనైనా తారసిల్లి మనస్సులవిప్పుకొని ప్రణయంలో పడకపోరని అభిజ్ఞ వర్గాలు అనుకున్నారు.

కాఫీహోటలులోనూ, సినీమా హాలులోనూ, బస్సులోనూ కాక సెలవలకి మేనమామగారి ఇంటికి రామారావు చుట్టపు చూపుగా వెళ్లినప్పుడు కలుసుకొన్నారు. రామారావు అంతర్జాతీయ పరిస్థితులూ, ముఠా రాజకీయాలూ, వర్గ కలహాలు పురస్కరించుకొని స్థానిక సమ్మెలో ఏ కార్యక్రమాన్ని అమలుపెట్టవలసినదీ, ఏఏ నినాదాలు యివ్వవలసినదీ ప్రస్తావించాడు. "పోనిద్దూ బావా! నీరాజకీయాలంటే నాకు తలనొప్పి. దయచేసి మరే కబుర్లేనా చెప్పు" అని అభిభాషించింది.

కనీసం స్థానిక కమ్మరి పనివాళ్ల సమ్మెతో నయినా సానుభూతి చూపని దానిని భార్యగా ఏ కుర్రాడేనా ఎలా అంగీకరించగలడు? అందుకే పట్నానికి తిరిగి వచ్చి ఉన్నతోన్నత విద్యని అభ్యసించుతున్నాడు.

అన్నీ నిజమయినా 'ఈ— ఏడు— గంటల— చీకటి— చలి— మూడు— గంటల' మధ్యాహ్నం పూట ఆలోచించుకుందికి అవేమీ అడ్డు రాలేదు. అతడి కన్నులలోని మసాబు వెల్తురులోని ఆడపిల్లల రంగు రంగు చీరల హుక్కుదారుల్లో ఒకర్తుక అతడిని చెయ్యిపట్టుకొని ఒక సలక్షణమయిన పెళ్లి పందిరిలోకి లాక్కెళ్లింది. వైభవంగాసాగుతున్నది పెళ్లి. మంత్రఘోష- మేళపు కోలాహలం, తొందర తొట్రుపాటు- హడావడి- అమ్మలక్కల హాస్యాలూ, నలుగులు- ఊరేగింపు, బాణా సంచా- ఉత్సాహం ఉత్సవం- ఉద్ధృతంగా- రామారావు మసాబు వెల్తురులో వేడికోర్కెలు రేగేయి. ఆ ఒకానొక ఒకర్తుకా తనూ పెళ్లిపీటలమీద, ముత్యాల పల్లకీలో, పట్టు పరుపులమీద- ఈ మసాబు వెలుతురులోకాక, నిజంగా విద్యుద్దీపాల ధగధగలో, బంధుమిత్రుల కళ్ళలో వెలిగే ఆనందపు కిరణాల వెలుతురులో కూర్చోవాలనిపించింది.

రామారావు ఆలోచిస్తున్నాడు. జోరుగా హోరుగా వర్షం కురుస్తోంది. మూడుగంటలకి మొదలుపెట్టిన వర్షం సాయంత్రం ఏడుగంటలకి వెలిసినా రామారావు ఆలోచనలు ఆఖరవలేదు.

అతనిలో మసాబు వెల్తురు అలాగే ఉంది. అనేకానేక మధురోహలు పోతూ మళ్లా వెనక్కి మళ్లుతూ అతడు డోలాందోళనలో ఉన్నాడు. జవ్వని ఒకర్తుక అతని మనస్సులో పీట వేసుకుంటున్నది.

మీట నొక్కితే దీపం వెలుగుతుంది అన్న సంగతి మూడు గంటలకే గుర్తుంచుకొంటే ఇంత చీకటిగా ఉండకపోను అన్న సంగతి ఏడుగంటలకి తట్టింది రామారావుకి. లేచి తిమ్మిరెక్కిన కాళ్లతో కుంటుకుంటూ వెళ్లి మీటనొక్కేడు.

అతనికి ఆకలేస్తోంది.